
ఫారం అందజేస్తున్న కోట నీలిమ


ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీలతా శోభన్‌రెడ్డి


దరఖాస్తు ఫారం అందజేస్తున్న కొలను లక్ష్మీబాల్‌రెడ్డి


బేగంపేటలో దరఖాస్తు ఫారం అందజేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, సీనియర్ నాయకుడు గొరపల్లి రమేష్


లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో దరఖాస్తుల కోసం క్యూలో నిలబడ్డ ప్రజలు

ఆరు గ్యారంటీలు.. అందితే మేలు

- ప్రారంభమైన ప్రజాపాలన
- మొదటి రోజు పోటెత్తిన ప్రజలు
- కొన్ని ప్రాంతాల్లో ఫారాలు అందక తిప్పలు
- సొమ్ము చేసుకుంటున్న జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు

సనత్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని మొదటి రోజు పోటెత్తారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని ఒక్కో డివిజన్‌లో నాలుగు సెంటర్ల చొప్పున ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట, మోండా డివిజన్లలో మొత్తం 24 సెంటర్లలో ఏర్పాటు చేసిన 96 కౌంటర్ల ద్వారా అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. కౌంటర్లతో పాటు ఒక్కో సెంటర్‌లో ఒక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటుచేసి అక్కడికి వచ్చేవారి సందేహాలను నివృత్తి చేశారు. అయితే ఇంటింటికీ దరఖాస్తు ఫారాలను అందిస్తామని ముందుగా ప్రకటించినప్పటికీ తమకు రాలేదంటూ ఆయా సెంటర్ల వద్దకు చేరుకుని దరఖాస్తు ఫారాల కోసం పోటీ పడ్డారు. ఉదయం 10 గంటల కల్లా దరఖాస్తుల ఫారాలు అయిపోవడంతో నిరాశకు గురయ్యారు. అయితే దరఖాస్తు ఫారం జిరాక్స్ పత్రాలను కూడా అనుమతించడంతో జిరాక్స్ సెంటర్లకు విపరీత డిమాండ్ ఏర్పడింది. ఇదే అదునుగా ఒక ఫారం జిరాక్స్‌ను రూ.25ల నుంచి రూ.50 వరకు వసూలు చేశారు. అన్నిచోట్లా ఇదే పరిస్థితి దాపురించడంతో సామాన్య ప్రజానీకం నానా ఇబ్బందులు పడ్డారు. దరఖాస్తు ప్రక్రియ ఆఫ్‌లైన్ కావడంతో నిరక్షరాస్యులు వాటిని పూర్తి చేయించేందుకు నానా తంటాలు పడ్డారు. కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు పత్రంలో ఎలాంటి వివరాలు నమోదు చేయకపోవడంతో అధికారులు కేవలం తెల్ల కాగితంపై రాయించుకుని తీసుకోవడం గమనార్హం.

అర్హులందరికీ అందిస్తాం..

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ఎలాంటి అధైర్యపడవద్దని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ పథకాల అమలు ప్రజాపాలన కేంద్రాలను ఆమె సందర్శించి అక్కడ సమస్యల పరిష్కారం కోసం అధికారులకు సూచనలు చేశారు.

కేంద్రాల సందర్శన..

ఆయా డివిజన్లలో ఏర్పాటు చేసిన కేంద్రాలను డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ హైదరాబాద్ దశరథ్‌సింగ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, ఎమ్మార్వో భీమయ్యగౌడ్, సెంటర్ టీమ్ లీడర్లు దామోదర్‌రెడ్డి, కైలాష్‌చంద్‌శ్రీవాత్సవ్‌తో పాటు నాయకులు బాల్‌రెడ్డి, రాజేష్‌ముదిరాజ్, జమీర్‌బేగ్, భార్గవ్ సందర్శించి దరఖాస్తు స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. అదే విధంగా బేగంపేటలో ఏర్పాటు చేసిన సెంటర్లను కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి పరిశీలించి అర్హులైన వారందరికీ పథకాలు అందేలా చూస్తామన్నారు.

గంటల తరబడి క్యూ లైన్‌లో..

అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్‌లోని బీజేఆర్ కమ్యూనిటీహాల్, బోయబస్తీ కమ్యూనిటీహాల్, ఎంసీహెచ్ క్వార్టర్స్‌లోని వార్డు కార్యాలయం, శాంతినగర్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద ప్రజలు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడ్డారు. అయితే చదువురానివారి ఫారాలు నింపేందుకు కొందరు రూ. 10 రూ. 20 వసూలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమ ప్రారంభోత్సవ నేపథ్యంలో స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి గురువారం దరఖాస్తు కేంద్రాలను సందర్శించి ఫారాలను పంపిణీ చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. కేంద్రం ఇన్‌చార్జ్ ఏఎంహెచ్‌ఓ వెంకటరమణ, లింగాని శ్రీను, నక్క మధు, సత్తయ్యగౌడ్, ఇస్మాయిల్, రవి పాల్గొన్నారు.

ఉచితంగా ఇస్తాం.. బయట కొనొద్దు..

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకునే వాళ్లు ఎలాంటి ఆందోళన చెందవద్దని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు. జనవరి 6వ తేదీ వరకు అవకాశం ఉందని, అందరి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ప్రతీ ఒక్కరికీ దరఖాస్తు ఫారాలు అందజేస్తామని, జీహెచ్‌ఎంసీ ఆర్పీలు ప్రతీ రోజు ఫారాలు పంపిణీ చేస్తారన్నారు. కొందరు తొందరపడి స్టేషనరీ, జిరాక్స్ సెంటర్, మీ సేవా కేంద్రాల్లో డబ్బులు పెట్టి దరఖాస్తు ఫా రాలు కొనుగోలు చేస్తున్నారని, అలా చేయకూడదని, తా మే ఉచితంగా ఇంటింటికీ తిరిగి పంపణీ చేస్తున్నామన్నారు.

తార్నాక డివిజన్‌లో 1136 దరఖాస్తులు..

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలో మాణికేశ్వర్‌నగర్‌లోని సెవన్ టెంపుల్స్ దేవాలయం కమ్యూనిటీ హాల్, తార్నాక నాగార్జున నగర్ కమ్యూనిటీ హాల్, లాలాపేట వినోభానగర్ కమ్యూనిటీ హాల్, శాంతినగర్‌లోని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల వద్ద ప్రజలు మొదటి రోజు 1136 దరఖాస్తులను సమర్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆరు గ్యారంటీలతో పాటు రేషన్ కార్డుల కోసం సైతం దరఖాస్తులు చేసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపారు.

- మాణికేశ్వర్‌నగర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజా పాలన మంచి కార్యక్రమం అని పార్టీలకు అతీతంగా ప్రజలకు న్యాయం జరగాలన్నారు. జీహెచ్‌ఎంసీ నుంచి కొత్త ప్రభుత్వానికి అన్ని విషయాల్లో పూర్తి సహకారం ఉంటుందన్నారు. తెల్ల రేషన్ కార్డులు ఇచ్చే విషయమై ప్రభుత్వం తొందరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమలలో జీహెచ్‌ఎంసీ అధికారులు సుధాంష్, హేమలత, పద్మలత, రజిత, వెంకటేష్ పాల్గొన్నారు.

కంటోన్మెట్‌లో 4033..

కంటోన్మెంట్: కంటోన్మెంట్ వ్యాప్తంగా 4033 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం ఎనిమిది వార్డుల పరిధిలో 32 ప్రాంతాల్లో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వచ్చే నెల 6 వ తేదీ వరకు ప్రాంతాల వారీగా ఆయా కేంద్రాలను మార్చనున్నారు.

నేడు దరఖాస్తుల స్వీకరణ చేపట్టే ప్రాంతాలు..

- **వార్డు 1:** కడక్‌పురా, కృష్ణారెడ్డి నగర్, అయ్యప్ప సొసైటీ, రిలయన్స్ విల్లా, పెన్షన్‌లైన్స్,బాపూజీనగర్
- **వార్డు 2:** గన్‌బజార్, వల్లభాయి పటేల్ నగర్, సీబీఎస్ నగర్, కట్టమైసమ్మ,
- **వార్డు 3:** సుభాష్ నగర్, అన్నానగర్, మహంకాళీ టెంపుల్, లంబాడీ హట్స్
- **వార్డు 4:** లక్ష్మీ నగర్, హరిజన్ బస్తీ, గాంధీ నగర్, హస్తినాపురం
- **వార్డు 5:** న్యూవాసవీ నగర్, దర్జీ బస్తీ, గాంధీనగర్, దుర్గయ్య గార్డెన్స్, సంజీవయ్య వీకర్ సెక్షన్, హనుమంతరావు గార్డెన్స్
- **వార్డు 6:** తాడ్‌బండ్ బజార్, మలానీ కాలనీ, శ్రీనివాస కాలనీ, మారుతి నగర్, సీతారాంపూర్ బస్తీ, నందమూరి నగర్
- **వార్డు 7:** అరుణ ఎన్‌క్లేవ్, సూర్య ఎన్‌క్లేవ్, దుర్గావిహార్ కాలనీ, సిల్వర్ స్ప్రింగ్ కాలనీ, చిన్న కమేలా, న్యూ గాంధీ నగర్, పెరుమాల్ హట్స్
- **వార్డు 8:** ఆదర్శ్ నగర్, పయనీర్ బజార్, చింతల్ బజార్, చింతల్ బస్తీ, అమ్ముగూడ

బౌద్ధనగర్ డివిజన్‌లో..

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లోని కమ్యూనిటీహాల్, బల్వాడి స్కూల్, అశోక్ నగర్ సేవా సంఘం, అశోక్ నగర్ కమ్యూనిటీహాళ్లలో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని కార్పొరేటర్ కంది శైలజ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వార్డు ఆఫీస్ ఇన్‌చార్జ్ ఉమర్, అశోక్ నగర్ సేవా సంఘం ఇన్‌చార్జ్ శశిధర్ రెడ్డి, రాంబాబు, భారత్ చక్రవర్తి, వరుణ పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో 50 సెంటర్లు..

చిలకలగూడ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆరు గ్యారంటీలతో ప్రవేశపెట్టిన ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరణ మొదటిరోజు ప్రహసనంగా మారింది. ప్రజలతో పాటు సంబంధిత అధికారులకు సరైన దిశానిర్దేశం లేకపోవడంతో గందరగోళంగా మారింది. కొందరికి దరఖాస్తుఫారాలు అందకపోవడం, కొన్నిచోట్ల జిరాక్స్ ప్రతులను తిరస్కరించడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో 20 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సీతాఫల్‌మండిలో స్వల్ప ఉద్రిక్తత..

సీతాఫల్‌మండి మీ–సేవ కేంద్రం వద్ద గురువారం ఉదయం స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. కేవైసీ అప్‌డేట్ కోసం వందల సంఖ్యలో ప్రజలు గత వారం రోజులుగా మీ–సేవ కేంద్రం చుట్టూ తిరుగుతున్నారు. సరైన వసతి సౌకర్యాలు లేకపోవడం, సిబ్బంది దురుసుగా ప్రవర్తించడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.ఈ క్రమంలో క్యూలైన్లలో నిల్చున్నవారిలో ఏపీ, తెలంగాణ అంటూ రెండు వర్గాలుగా చీలి ఘర్షణకు దిగారు.


ఉప్పలబస్తీ సెంటర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం


బోయబస్తీలో.. దరఖాస్తు ఫారాన్ని అందజేస్తున్న ప్రసన్నలక్ష్మి


దరఖాస్తు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి


దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న కార్పొరేటర్ శైలజ

కార్మిక పక్షపాతి పీజేఆర్


పీజేఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రసూల్‌పురా: కార్మికుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేసిన గొప్ప నాయకుడు పి.జనార్దన్‌రెడ్డి (పీజేఆర్) అని బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. గురువారం పీజేఆర్ వర్ధంతి సందర్భంగా జేబీఎస్ చౌరస్తాలోని పీజేఆర్ విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పీజేఆర్ మంత్రి, సీఎల్పీ నేత, కార్మిక పక్షపాతిగా తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంతో పీజేఆర్‌కు ప్రత్యేక అనుబంధం ఉందని, ఎందరో స్థానిక నేతలకు రాజకీయ గురువు అని పేర్కొన్నారు. వివిధ పార్టీల నాయకులు డీబీ. దేవేందర్ ఆకుల నాగేష్, ప్యారసాని రామ్‌కుమార్, రమేష్, శ్రీనివాస్, సంకీ రవిందర్, వరదరాణి, రామారావు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మండల పూజ


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

చిలకలగూడ : మెట్టుగూడ అయ్యప్ప దేవాలయం ఆధ్వర్యంలో మండల పూజ, అంబారీ ర్యాలీ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు, కార్పొరేటర్లు సునీత, సామల హేమ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళ సంప్రదాయ వాద్య సంగీతం, అయ్యప్పస్వామి స్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ నిర్వాహకులు రవిచంద్రన్, నాయర్, సునీల్‌లతోపాటు అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఓయూ కేలండర్ విడుదల



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పేరు మీద లైటింగ్ సిస్టమ్ ఆర్ట్స్ కాలేజీ భవనం చిత్రపటంతో రూపొందించిన నూతన కేలండర్‌ను వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్‌రావు, కంట్రోలర్ ప్రొ.రాములుతో కలిసి ఆవిష్కరించారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం


ఆవిర్భావ దినోత్సవంలో కోట నీలిమ


ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న బొల్లు కిషన్,యేసురత్నం

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగరవేశారు. తిరుమలగిరిలోని పార్టీ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు ప్యార సాని రామ్‌కుమార్, బొల్లారంలోని పార్టీ కార్యాలయం వద్ద ఎస్సీ సెల్ నగర ఉపాధ్యక్షులు, నరసింహన్ కన్నన్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్, రషీద్, నిఖిల్, దత్తు, విష్ణు, బంటి. జోషఫ్, జగన్, వినోద్, వేణు, రాజేష్, రవి పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో..

సనత్‌నగర్: కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం గురువారం సనత్‌నగర్ నియోజకవర్గంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ ఆధ్వర్యంలో 32 చోట్ల కాంగ్రెస్ జెండాలను ఎగరవేశారు.అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని నీలిమ పేర్కొన్నారు.


అంబేడ్కర్ నగర్‌లో..

కంటోన్మెంట్: మోండా డివిజన్ అంబేడ్కర్ నగర్‌లో పార్టీ సీనియర్ నేత తాటికాయల యేసు రత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవిర్భావ వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో తొలిసారిగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పేదలకు మేలు జరుగుతుందన్నారు. శ్యామ్‌సన్ రాజు, గౌరీ శంకర్, బద్రీ నాథ్ యాదవ్, నందికంటి రవి పాల్గొన్నారు.

- కంటోన్మెంట్ ఐదోవార్డులో పార్టీ నేత గజ్వేల్ భరత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సంజీవ రెడ్డి, ఆయుబ్ ఖాన్, మల్లప్ప, రాజేశ్, సాయి, రాజు, అరుణ్, విజయ్ పాల్గొన్నారు.

లాలాపేటలో..

లాలాపేట: కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ వేడుకలను గురువారం తార్నాక డివిజన్ లాలాపేటలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. లాలాపేట లేబర్ అడ్డా వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, లాలాపేటలోని మెటర్నిటీ హాస్పిటల్‌లో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్‌లాల్, హరినాథ్, రవి, సురేష్, ఆటో శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.


బొల్లారంలో వేడుకల్లో పాల్గొన్న నరసింహ కన్నన్, అరవింద్


తిరుమలగిరిలో జెండా ఆవిష్కరిస్తున్న ప్యారసాని రామ్‌కుమార్

నిస్సహాయులను ఆదుకోవాలి


దుప్పట్లు అందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

చిలకలగూడ: నిరుపేదలు, నిస్సహాయులు, అన్నార్తులను ఆదుకోవడం సామాజిక బాధ్యతగా గుర్తించి తమవంతు సహాయ సహకారాలు అందించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న నిస్సహాయులకు సీతాఫల్‌మండికి చెందిన సెర్వింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కోనేటి శ్వేతశ్రీ (పింకీ) ఆధ్వర్యంలో బుధవారం రాత్రి దుప్పట్లు, ఆహార పొట్లాలు, మాస్క్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదలను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఎమ్మెల్యేగా పద్మారావు హ్యాట్రిక్ విజయాన్ని పురస్కరించుకుని సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు శ్వేతశ్రీ తెలిపారు. చిలకలగూడ, బోయిగూడ, పద్మారావునగర్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో సుమారు వంద మందికి దుప్పట్లు, ఆహార ప్యాకెట్లు అందించారు. కార్పొరేటర్ హేమ, సంగీత, పవిత్ర, అర్చన, వరుణ్, శేఖర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

లాలాపేట: ఇందిరమ్మ అభయా హస్తం పేరుతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను అర్హులందరికి అందేలా కృషి చేస్తామని స్థానిక కాంగ్రెస్ నేతలు అన్నారు. గురువారం ప్రారంభమైన ప్రజా పాలన కార్యక్రమాన్ని తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో కాంగ్రెస్ నేతలు పర్యవేక్షించారు. అక్కడికి వచ్చిన ప్రజలకు మార్గ నిర్దేశం చేశారు. అధికారులు, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మాజీ వార్డు మెంబర్ లాజరస్ మాట్లాడుతూ.. జనవరి 6వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రజా పాలనలో అర్హులైన ప్రజలందరూ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రవి, శ్రీనివాస్, నర్సింహ, లింగయ్య, వెంకటేష్, కుమార్, రవీందర్, శంకర్, అశోక్ రాజ్,ప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలి



లాలాపేట: రాష్ట్రంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గొర్రెల యూనిట్ల కోసం ఇప్పటికే డీడీలు కట్టి చాలా రోజులైందన్నారు. గొర్రెల యూనిట్లు అయినా ఇవ్వాలి లేదా చెల్లించిన డీడీలను నగదు రూపంలో బదిలీ చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆరగాని రమేష్, శ్రావణ్, శ్రీనివాసులు ఉన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ నూతన కమిటీని యూనివర్సిటీ కార్యదర్శి రవినాయక్ ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ విద్యార్థి శ్రీధర్, కార్యదర్శిగా పొలిటికల్ సైన్స్ విభాగం విద్యార్థి శ్రీకాంత్‌తో పాటు 24 మంది సభ్యులతో నూతన కమిటీని ప్రకటించారు.

దశలవారీగా అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లాస్యనందిత

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో దశలవారీగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే జి.లాస్యనందిత పేర్కొన్నారు. గురువారం ఏడో వార్డు బంజరానగర్ లో స్పీడ్ బ్రేకర్లు, సోలార్ లైటింగ్ సూచిక స్తంభాలు, వీధి దీపాలను లాస్య నందిత ప్రారంభించి మాట్లాడారు. వచ్చే ఏడాది బడ్జెట్ విడుదల జరిగిన అనంతరం రోడ్లు, మురుగునీటి సమస్య పరిష్కారానికి నూతనంగా డ్రైనేజీ పైపులైను పనులు, పార్కుల అభివృద్ధి, తాగునీటి సరఫరా తదితర పనులు చేపడతామన్నారు. తన తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న ఇచ్చిన హామీలను సైతం పూర్తి చేస్తామన్నారు. కాలనీ అంతర్గత రోడ్లపై వాహనదారులు వేగంగా వెళ్లకుండా నియంత్రించేందుకు సోలార్ బ్లింకరింగ్ సూచికలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా రవికాలనీ, ఐటీబీ కాలనీ, ఎస్‌బీహెచ్ కాలనీ, బంజారా నగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే లాస్యనందితను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి. శ్యాంకుమార్, భాగ్యశ్రీ, వైవీ. రావు, శ్రద్దాన్, జయలక్ష్మి, సరళ పాల్గొన్నారు.

‘పేదల కోసం కొట్లాడేది ఎర్ర జెండా పార్టీనే’



లాలాపేట: సమాజంలో పేద ప్రజల కోసం కొట్లాడే పార్టీ ఎర్ర జెండానే అని సీపీఐ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గురువారం తార్నాక చౌరస్తాలో నిర్వహించిన సీపీఐ ఆవిర్భావ దినోత్సవంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు కొమురెల్లి బాబు పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఉద్యమ గీతాలను ఆలపిస్తూ, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. దున్నే వాడిదే భూమి, ఇల్లు లేని వారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు, సాగు భూమి పంపిణీ తదితర కార్యక్రమాలతో 99 ఏళ్లుగా అట్టడుగు వర్గాల ప్రజల కోసం సుదీర్ఘంగా పోరాటాలు నడిపిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. శ్రీనివాస్, రాములు, లక్ష్మణ్, శ్రీహరి, హుస్సేన్,శివ, శ్రీను,మల్లేష్, రవి,యాకయ్య, బాలమణి,పద్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఆ ఏజెంట్లతో అప్రమత్తంగా ఉండండి

రీజనల్ పాస్‌పోర్ట్ అధికారి స్నేహజ

సనత్‌నగర్: రిజిస్టర్ కాని రిక్రూట్‌మెంట్ ఏజెంట్లు అందించే నకిలీ ఉద్యోగ ఆఫర్లతో మోసపోతున్న విదేశీ ఉద్యోగార్థుల సంఖ్య పెరుగుతుండడం విచారకరమని, అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ జొన్నలగడ్డ స్నేహజ పేర్కొన్నారు. నకిలీ ఉద్యోగ మోసాలపై ఆమె హెచ్చరిస్తూ విదేశీ మంత్రిత్వ వ్యవహార శాఖ తరుపున గురువారం ఓ ప్రకటనను విడుదల చేశారు. విదేశీ మంత్రిత్వ శాఖ నుంచి లైసెన్స్ పొందకుండానే సుమారు రెండున్నర లక్షల మంది చట్టవిరుద్ధమైన ఏజెంట్లు ఉన్నట్లు వెల్లడించారు. చాలామంది అక్రమ ఏజెంట్లు ఫేస్‌బుక్, వాట్సాప్, టెక్స్ట్ మెసేజ్, ఇతర మాధ్యమాల ద్వారా పనిచేస్తూ విదేశీ ఉద్యోగార్థులను మోసం చేస్తున్నారనే సమాచారం విదేశీ మంత్రిత్వ శాఖ దృష్టికి వచ్చినట్లు వివరించారు. ఏజెంట్లు వారి గురించి ఎలాంటి సమాచారం లేకుండా కేవలం వాట్సాప్ ద్వారా మాత్రమే కమ్యూనికేట్ చేస్తారన్నారు. దీని ద్వారా జాబ్ ఆఫర్ వాస్తవికతను నిర్ధారించడం కష్టతరమవుతుందన్నారు. ఇలాంటి ఏజెంట్లు ముఖ్యంగా కార్మికులను అతి క్లిష్టమైన, ప్రాణాంతకమైన పరిస్థితుల్లో పని చేయించేలా పురమాయిస్తారన్నారు. తూర్పు ఐరోపా, గల్ఫ్, మధ్య ఆసియా దేశాలతో పాటు ఇజ్రాయెల్, కెనడా, మయన్మార్, లావో పీపుల్ డెమోక్రటిక్ రిపబ్లిక్‌లలో క్లిష్టమైన పనుల్లో రిక్రూట్‌మెంట్ కోసం ఏజెంట్లు ప్రయత్నిస్తున్నారన్నారు. చెల్లుబాటయ్యే ఉద్యోగ ప్రతిపాదనలకు పర్యాటక వీసా మినహా ఉపాధి, పనివీసా, ఇతర సారూప్య వీసాల ఆధారంగా వలస వెళ్లడానికి కార్మికుడిని అనుమతించాలన్నారు. ప్రీ డిపార్చర్ ఓరియంటేషన్ ట్రైనింగ్ (పీడీఓటీ) సెంటర్లకు హాజరుకావడం ద్వారా తాము వెళ్లే దేశంలోని సంబంధిత ఇండియన్ ఎంబసీకి చెందిన కమ్యూనిటీ వెల్ఫేర్ వింగ్ నుంచి సమాచారాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు.

నియామకం


నియామకపత్రాన్ని అందుకుంటున్న గంట రాజు సాగర్

అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్ర సగర సంఘం కార్యదర్శిగా అడ్డగుట్టకు చెందిన గంట రాజు సాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు కర్ణాటక రాష్ట్రానికి చెందిన చిత్రదుర్గ భగీరథ పీఠాధిపతి పురుషోత్తమానందపురి స్వామీజీ సమక్షంలో రవీంద్రభారతిలో రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ చేతుల మీదుగా గురువారం నియామకపత్రాన్ని అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో సంగం ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం, గౌరవ అధ్యక్షులు హరికిషన్, నాగేశ్వరరావు, రవీందర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ఏఎస్‌ఐ మృతి


ఏఎస్‌ఐ నన్యానాయక్(ఫైల్)

సనత్‌నగర్: రాష్ట్రపతి బందోబస్తు కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురైన మహంకాళి పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ నన్యానాయక్ చికిత్స పొందుతూ గురువారం తుది శ్వాస విడిచారు. ఈ నెల 18న తేదీన ప్రమాదానికి గురై యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన వెంటనే నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అక్కడి వైద్యులను సంప్రదిస్తూ ఏఎస్‌ఐ నన్యానాయక్ ప్రాణాలు కాపాడేందుకు శాయశక్తులా ప్రయత్నించినా వైద్యుల కృషి ఫలించలేకపోయింది. అంత్యక్రియల ఖర్చులకు కో–ఆపరేటివ్ నుంచి రూ.30 వేలు, సీపీ వెల్ఫేర్ నుంచి రూ.20 వేలు అందజేశారు. ఏఎస్‌ఐ భౌతికకాయాన్ని స్వస్థలమైన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి తరలించారు. అంతక ముందు నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని, మహంకాళి ఏసీపీ రవీందర్ యశోద ఆస్పత్రికి వచ్చి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.